

క్యూఆర్ కోడ్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

చొప్పదండి, మే 16 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలోని వివిధ వ్యాపార సంస్థల యజమానులకు 08247649631 నెంబర్ నుంచి మున్సిపల్ కమిషనర్ కార్పొరేషన్ ఆఫీస్, తెలంగాణ పేరుతో ఫోన్‌కాల్స్ చేస్తూ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలని వాట్సాప్ ద్వారా క్యూఆర్ కోడ్ పంపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చొప్పదండి మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రకమైన మోసాల పట్ల పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇట్టి క్యూఆర్ కోడ్‌కు ఎలాంటి డబ్బులు చెల్లింపు చేయరాదని తెలిపారు.

సుడా భవనానికి స్థలం కేటాయింపు

- వన్‌టౌన్ పీఎస్ పక్కన 7 గుంటల స్థలం
- సుడా చైర్మన్‌కు స్వాధీనం చేసిన అధికారులు
- త్వరలో భవన నిర్మాణం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఇంతకాలం అద్దె భవనాల్లో కొనసాగుతున్న శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)కి స్వంత భవన నిర్మా ణం కోసం ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో కేడీసీసీ బ్యాంకు హెడ్ ఆఫీస్ ఎదురుగా సర్వే నెం. 285లో 7 గుంటల స్థలాన్ని కేటాయించి ఆ స్థలాన్ని కలెక్టర్ సుడాకు స్వాధీనం చేశారు. గతంలో ఈ స్థలంలో ఉన్న భవనంలో చాలాకాలం పాటు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) కార్యాలయాన్ని నిర్వహించారు. అనంతరం దీనిని త్యాగరాజ లలిత కళాపరిషత్‌కు కేటాయించారు. ఈ పాత భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రైవేట్ వ్యక్తులకు లాడ్జి, హోటల్, తదితర వ్యాపారాలు నిర్వహించుకోవడానికి గతంలో అద్దెకు ఇచ్చారు. ఆ తర్వాత దీనిని తమకే కేటాయించాలంటూ లీజుదారులు కోర్టుకు వెళ్లారు. అయితే కోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ప్రభుత్వం స్థలాన్ని స్వాధీనం చేసుకుని భవనాన్ని కొంత మేరకు కూల్చివేసింది. ప్రస్తుతం ఆ స్థలాన్ని జిల్లా కలెక్టర్ సుడాకు కేటాయించారు. ప్రస్తుతం సుడా జిల్లా పరిషత్ భవనంలో 38 వేల రూపాయలు అద్దె చెల్లిస్తూ ఉంటూ వస్తున్నది. స్థలం కేటాయింపుతో సుడాకు స్వంత భవనం ఏర్పాటు కానున్నది. ఈ స్థలంలో మూడు ఫ్లోర్లలో భవన నిర్మాణం చేపట్టి ఒక ఫ్లోర్‌లో కన్వెన్షన్ సెంటర్, మరో ఫ్లోర్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేస్తామని మూడవ ఫ్లోర్ కార్యాలయం కోసం వినియోగించి సంస్థకు మరింత ఆదాయం చేకూర్చేలా భవనాన్ని డిజైన్ చేసి నిర్మిస్తామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి చెప్పారు.

సుడాకు కేటాయించిన స్థలం(ఫైల్)



'భూభారతి' దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

- అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



సైదాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

సైదాపూర్, మే 16(ఆంధ్రజ్యోతి): భూభారతి ఆర్‌ఓఆర్ చట్టం అమలులో భాగంగా పైలెట్ మండలం సైదాపూర్ లోని వివిధ గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించా లని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సైదాపూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో, వెన్నంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిచిన రెవెన్యూ సదస్సులను సందర్శించారు. రైతుల నుంచి స్వీరించిన దరఖాస్తులను పరిశీలిం చారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సైదాపూర్ మండలాన్ని భూభారతి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నేపథ్యంలో, భూసమస్యలున్న వారు రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖా స్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తులు స్వీకరించి నూతన చట్టం ప్రకారం భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ప్రజలు భూ సమస్య లపై తహసీల్దార్, ఆర్డీవో వద్దకు వెళ్లేవారని, ఇప్పుడు అధికారులే స్వయంగా గ్రామాలకు వచ్చి ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దరఖాస్తు లను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి సమస్యలు పరిష్కరిం చాలని కలెక్టర్ రెవెన్యూ బృందాలను ఆదేశిం చారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, భూభారతి నిబంధనలపై అధికారులు పరిపూర్ణమైన అవగాహన కలిగి ఉన్నప్పుడే తప్పిదాలకు తావులేకుండా సమస్యలు పరిష్కారమవు తా యని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీ ల్దార్‌లు గుర్రం శ్రీని వాస్, కనకయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్

సైదాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరమ్మతు పనులను పరిశీలించారు. ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటాలని, పచ్చదనం కనిపించేలా తీర్చిదిద్దా లని సూచించారు. అనంతరం ఇక్కడి ఓపీ రికార్డు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల ఆధార్, ఫోన్‌నెంబర్ సేకరించి ఆయుష్మాన్ భారత్‌లో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని అన్నారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తు లకు అవసరమైన మాత్రలు నిరంతరం అందు బాటులో ఉంచాలని అన్నారు. మహిళలకు మల్టీ విటమిన్ టాబ్లెట్లు, క్యాల్షియం ఐరన్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. ఆరోగ్య మహిళ ఉచిత వైద్య పరీక్షల బోర్డును కేంద్రంలో ప్రదర్శించాలని సూచించారు. కలెక్టర్ వెంట మెడికల్ ఆఫీసర్ కృష్ణారావు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తా..

- మంత్రి పొన్నం ప్రభాకర్



స్వామి వారికి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి, మే 16 (ఆంధ్రజ్యోతి): సుందరగిరి వేంకటేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులు కేటాయించేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సుందరగిరి గ్రామంలో గల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు నిర్వహించే స్వామి వారి రథోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ ఆలయ అభివృద్ధిపై మంత్రికి వినతిపత్రం అందించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ కమిటీ సభ్యులు ఇచ్చిన వినతిపత్రం మేరకు గుట్టపైకి రహదారి, కల్యాణ మండపం కార్యక్రమాలతో పాటు ఆలయ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతుగా తోడ్పాటు అందించాలని అన్నారు. సుందరగిరి గ్రామంలో గల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులను, అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సొల్లేటి శంకరయ్య, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సిద్దిపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

19న బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర

భగత్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తెలంగాణ చౌక్ నుంచి టవర్‌సర్కిల్ వరకు ఈ నెల 19న బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తిరంగా ర్యాలీని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా వీర జవాన్లకు వందనాలు తెలుపుతూ, భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన అన్ని రక్షణ వ్యవస్థలను అభినందిస్తూ దేశవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో తిరంగాయాత్రలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో 19న సాయంత్రం 5 గంటలకు యాత్ర నిర్వహించనున్నామని తెలిపారు. ప్రజలందరూ తిరంగా యాత్రలో పాల్గొని భారత సైనికులకు వందనాలు తెలియజేయాలని, మోదీ నాయకత్వాన్ని బలోపేతం చేయాలని కోరారు. ఉగ్రవాద నిర్మూలనకు సంకల్పబద్ధంగా శపథం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

బస్టాండ్ ఆవరణలో నిరంతరం తనిఖీలు నిర్వహించాలి

- సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, మే 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్‌స్టాండ్ ఆవరణలో నిరంతరం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం సిబ్బందిని ఆదేశించారు. ప్రయాణీకుల భద్రత కోసం ఏర్పాటు చేసిన పోలీసు అవుట్‌పోస్టును శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అవుట్‌పోస్ట్ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో సీపీ మాట్లాడి వారి పనితీరును తెలుసుకున్నారు. అవుట్‌పోస్ట్ రికార్డులను పరిశీలించారు. బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు.

ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ అవుట్‌పోస్ట్ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందు బాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండా లన్నారు. ప్రయాణికులు, ప్రజలు అవుట్‌పోస్ట్‌కు వచ్చి సేవలు అడిగితే వెంటనే స్పందించి వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రజల భద్రతకు పెద్దపీట వేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిఘా ఉంచాలన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం



కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం చేస్తున్న భక్తులు

ఆధ్యాత్మిక పుష్కరం.. అలౌకిక ఆనందం

- అంతర్వాహినిలో మునక.. పుణ్యస్నానాలకు ప్రతీక
- రెండో రోజు పోటెత్తిన భక్తజనం
- కాళేశ్వర-ముక్తీశ్వర ఆలయం వద్ద రద్దీ

7

అప్రమత్తంగా ఉండండి

- మారిన జీవనశైలి.. ఆహారపు అలవాట్లు
- ముందు జాగ్రత్తలతో అదుపులో
- నేడు హైపర్‌టెన్షన్ డే

7

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ
- డెంగ్యూపై అవగాహన ర్యాలీ

భగత్‌నగర్, మే 16(ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాల్లో శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ వ్యాధి దినం సందర్భంగా శుక్రవారం కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ సంవత్సరం చెక్, క్లీన్, కవర్ అనే ప్రతిజ్ఞతో డెంగ్యూ దినం జరుపుకుంటున్నామని తెలిపారు. ఇన్ఫెక్టెడ్ ఆడ ఏడిస్ ఈజిప్ట్ దోమకాటు వల్ల డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండే ట్యాంకులు, డ్రమ్ములు, ఇతర పాత్రలపై మూతలు ఉంచాలని, శరీరాన్ని కప్పిఉంచేలా దుస్తులు ధరించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. అధిక జ్వరం, తలనొప్పి, కీళ్ల, కండరాల నొప్పి, ముక్కు, చిగుళ్ల నుంచి తేలికపాటి రక్తస్రావం వంటి డెంగ్యూ లక్షణాలను ముందుస్తుగా సకాలంలో గుర్తిస్తే సరైన చికిత్స అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీవో డాక్టర్ రవీందర్‌రెడ్డి, పీవోడీటీ డాక్టర్ ఉమాశ్రీ, డీఐఓ డాక్టర్ సాజిదా, ఎన్‌సీడీ పీవో డాక్టర్ విప్లవశ్రీ, ఎంసీహెచ్‌పీవో డాక్టర్ సనజవేరియా, డీఎంవో డాక్టర్ శైలేంద్ర, డెమో రాజగోపాల్, డీపీవో స్వామి, మెడికల్ ఆఫీసర్ నజియా, సబ్ యూనిట్ ఆఫీసర్ రామనాథం, మల్లయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో పెరిగిన రాజకీయ జోక్యం



హుజూరాబాద్‌లో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

హుజూరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లలో రాజకీయ జోక్యం బాగా పెరిగిపోయిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణ శివారులోని గణేష్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిరుపేదలకు కేటాయించాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని భారీగా పోలీసు బలగాలు మోహరించారు. సీపీఐ కార్యకర్తలు ర్యాలీగా రాగా, గంటపాటు హుజూరాబాద్‌లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కనకయ్య సీపీఐ నాయకుల నుంచి వినతిపత్రం స్వీకరించారు. నెల రోజుల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ హుజూరాబాద్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను గత ప్రభుత్వం పంపిణీ చేయకపోగా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్న పట్టించుకోవడం లేదన్నారు. పాలకులు పేదరికాన్ని పెంచి పోషించడం వల్ల ఇప్పటికీ ఇల్లు లేని వాళ్లు ఉన్నారంటే వారు సిగ్గుపడాలన్నారు. ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లలో నాలుగు చక్రాల వాహనాలు ఉంటే అనర్హులుగా ప్రకటించడం శోచనీయమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిబంధనలు తప్పుల తడకగా ఉన్నాయన్నారు. నిరుపేదలకు నెల రోజుల్లో ఇళ్లు కేటాయించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, నాయకులు సృజన్, అశోక్, రాజు, శ్రీనివాస్, వెంకటేష్, శారద, జి రవి, రాములు, కల్యాణ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం



గణేశ్‌నగర్, మే16 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి అర్హత కలిగిన ఎస్‌సీ,ఎస్‌టీ,బీసీ, ఈబీసీ, మైనారిటీ, వికలాంగుల విద్యార్థులు కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకో వాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పి పవన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకట నలో తెలిపారు. మార్చి-2025లో 10వ తరగతిలో 7.0 జీపీఏ/400 మార్కులు ఆపై గ్రేడు పొందిన విద్యార్థులు మాత్రమే అర్హులు అని తెలిపారు. ప్రభుత్వ షెడ్యూల్డ్ కులముల వసతి గృహములు /ఆశ్రమ పాఠశాలలు / కస్తూర్బా పాఠశాలలు, ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాటశాలల్లో చదివిన విద్యార్థులు (డే స్కాలర్స్), ప్రభుత్వ సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్స్, జవహర్ నవోదయ విద్యాలయాల విద్యార్థులు, బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు ఈ నెల 17 నుంచి 31 వరకు ఈ-పాస్ (https://telanganaepass.cgg.gov.in) దరఖాస్తుతో పాటు ధ్రువీకరణ పత్రాలు జతపరుచాలని తెలిపారు. 10వ తరగతి పాస్ మెమో, కులం, ఆదాయం, (2 లక్షల లోపు) ధ్రువీకరణ పత్రాలు మీ-సేవా ద్వారా పొందినవి, బ్యాంకు పాస్ బుక్, ఆధార్ నెంబర్, రేషన్ కార్డ్ నెంబర్, పాస్‌పోర్ట్ ఫొటో, ప్రభుత్వ షెడ్యూల్డ కులముల వసతి గ్రుహ విద్యార్థులు (3) సంవత్సరంల బొనఫైడ్ పత్రము జతపరుచాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ-పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునే ముందు విద్యార్థులు ప్రాధాన్య క్రమంలో మూడు కళాశాలలను ఎంపిక చేసుకోవాలన్నారు. దరఖాస్తు ముగిసిన తర్వాత ఈ-పాస్ సిస్టమ్ ద్వారా కళాశాలల ఎంపిక ఆటోమేటిక్‌గా జరుగుతుందని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం


సంతోష్‌గౌడ్(ఫైల్)

ఇల్లంతకుంట, మే 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జవారిపేటకి చెందిన మేరుగు సంతోష్‌గౌడ్(35) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులతో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలప్రకారం.. సంతోష్‌గౌడ్ ట్రాలీ ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఇటీవలే ఇంటి నిర్మాణం చేపట్టడంతోపాటు ఆటో సరిగా నడవకపోవడంతో దాదాపురూ.30లక్షల వరకు అప్పులయ్యాయి. దీనితో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంటి నుంచి ఆటోలోవెళ్లిన సంతోష్‌గౌడ్ గాలిపెల్లి గ్రామంలోని కెనాల్ సమీపంలో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య జ్యోతి, కుమార్తెలు శృతి,హర్షిత,కుమారుడు విశిత్‌గౌడ్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కదిరె శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

గంభీరావుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలోని దోసలగూడెం కాలనీకి చెందిన కదారి బాలమణి(38) అనే మహిళ ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో బాలమణి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొడుకు పెళ్లికోసం మైక్రో ఫైనాన్స్‌ల్లో, మహిళా గ్రూపుల్లో కలిపి 3లక్షల 50వేల రూపాయల వరకు అప్పుతీసుకుంది. తీసుకున్న అప్పులు నెలనెలా కట్టలేని పరిస్థితి ఏర్పడింది. అప్పులు ఎలాకట్టేది అంటూ నిత్యం బాలమణి మానసికంగా కృంగిపోయింది. శుక్రవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో బాలమణి ఉరి వేసుకుంది. దీంతో ఇరుగుపొరుగు బాలమణిని ముస్తాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో వైద్యులు పరిక్షించి, బాలమణి మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతురాలుకు భర్త, ఇద్దరుకుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరళించి, కేసునమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్‌ఐ ప్రేమానందం తెలిపారు.

మద్యం మత్తులో నేత కార్మికుడి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌లో కొండ రాకేశ్(43) అనే నేతకార్మికుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన రాకేశ్ కుటుంబ సభ్యులతో కలిసి బీవైనగర్‌లో అద్దెకు ఉంటున్నాడు. నాలుగు జోడీల పవర్‌లూమ్స్ అద్దెకు తీసుకొని తండ్రి లక్ష్మీరాజంతో కలిసి రాకేశ్ నడిపిస్తున్నాడు. అప్పుడప్పుడు అతిగా మద్యం సేవించే రాకేశ్ మానసిక స్థితి సరిగా ఉండదు. ఈనేపథ్యంలో గురువారం సాయంత్రం మద్యం మత్తులో రాకేశ్ ఇంట్లోని వస్తువులు చిందరవందర చేసి భార్య ఉజ్వల, ఇద్దరు కొడుకులను నెహ్రూనగర్‌లోని తన తల్లిదండ్రుల వద్ద వదిలి తిరిగి అద్దె ఇంటికివచ్చాడు. రాత్రి రేకులషెడ్డులో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తండ్రి లక్ష్మీరాజం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు టౌన్ సీఐ కె.కృష్ణ తెలిపారు.

వడదెబ్బతో హమాలీ కార్మికుడి మృతి

ఎలిగేడు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన హమాలీ కార్మికుడు మ్యాదవేణి రాజయ్య(52) శుక్రవారం వడదెబ్బతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రోజంతా పనిచేసి సాయంత్రం అస్వస్థతకు గురయ్యాడు. శుక్రవారం ఉదయం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు ఉన్నారు. పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జరగండి..జరగండి..

మహిళా డ్రైవర్లు వస్తున్నారండి

- ఈవీ ఆటో డ్రైవింగ్‌లో మహిళలకు శిక్షణ
- కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ
- శిక్షణ అనంతరం ఆటోలు కొనేందుకు రుణాలు

తిమ్మాపూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఇప్పటి వరకు పురుషులే ఎక్కువగా ఆటోలు నడుపుతున్నారు. ఆటో డ్రైవింగ్ చేసే ఆడవాళ్లు కనబటం అరుదు. కరీంనగర్‌లో త్వరలో మహిళా ఆటో డ్రైవర్లు కనిపించబోతున్నారు. ఎల్‌ఎండీ కాలనీలోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు వికాస కేంద్రంలో మహిళలకు ఎలక్ట్రిక్ ఆటో(ఈవి)లో శిక్షణ ఇస్తున్నారు. ఏప్రిల్ 12పదిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి శిక్షణను ప్రారంభించారు.


ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ తరగతులను వీక్షిస్తున్న మహిళలు


ఆటోలో ప్రయాణిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి (ఫైల్)

కలెక్టర్ సహకారంతో శిక్షణ

సుధారాణి, మహిళ ప్రాంగణం జిల్లా మేనేజర్



కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక చొరవ తీసుకొని మహిళలు, పురుషులకు దీటుగా ఎదగాలని ఈ శిక్షణ ప్రారంభించారు. మహిళలు ఉత్సాహంగా శిక్షణకు హాజరవుతున్నారు. శిక్షణ పొందుతున్న మహిళలకు ఆటోలు కొనుగోలు చేసేందుకు బ్యాంకుల ద్వారా లోన్‌లు ఇప్పించి వారికి సహకారం అందిస్తామని కలెక్టర్ చెప్పారు. ఆటో శిక్షణకు బజాజ్ మోటర్స్ వారు ఉచితంగా ఆటోతోపాటు సహాయకుడిని, టీ షర్టులను ఇచ్చారు.

తొలి విడతలో 15 మంది

ప్రస్తుతం 15 మంది మహిళలకు ఈవీ ఆటో తొలి విడత శిక్షణ కొనసాగుతోంది. శిక్షణతోపాటు మధ్యాహ్నం ఉచితంగా భోజనం, సాయంత్రం జావ అందజేస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డ్రైవింగ్‌లో ప్రాక్టికల్, థియరీ బోధిస్తున్నారు. శిక్షణ పొందే మహిళలు పూర్తిస్థాయిలో నైపుణ్యం సాధించే విధంగా తీర్చి దిద్దుతున్నారు. శిక్షణ తీసుకుంటున్న మహిళలకు మండల కేంద్రంలో ఉన్న జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్కుకు తీసుకువెళ్లి నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం లెర్నింగ్ లైసెన్స్‌కు పరీక్షలు రాయించారు. అందరు మహిళాలు లెర్నింగ్ లైసెన్స్ సాధించారు. మొదటి విడతలో ఈవీ ఆటో డ్రైవింగ్ శిక్షణ తీసుకుంటున్న 15 మంది మహిళల్లో ఆరుగురు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు ఉన్నారు.




◄ శిక్షణ పొందుతున్న మహిళా డ్రైవర్ ఆటోలో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దంపతులు, ▲ తిమ్మాపూర్ ఆర్టీఏ కార్యాలయం వద్ద ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్‌లో శిక్షణ తీసుకుంటున్న మహిళా ఆటో డ్రైవర్లు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

పసునూరి శిరీష, కరీంనగర్, బ్యాచ్ ఇన్‌చార్జి



నేను పీజీ పూర్తి చేశాను. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతోనే ఈవీ ఆటో శిక్షణలో చేరాను. ఇక్కడ చాలా బాగా శిక్షణ ఇస్తున్నారు. లెర్నింగ్ లైసెన్స్ పొందాను. కలెక్టర్ మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ శిక్షణ భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుంది.

ఆటో కొనుగోలు చేసి నడుపుకుంటా

జె అర్చిత, బాలయ్యపల్లె



నేను బీటెక్ చేసినా ఉద్యోగం లభించలేదు. మహిళ ప్రాంగణంలో ఉచితంగా ఆటో డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తుండడంతో చేరాను. శిక్షణ పూర్తయిన తర్వాత ఆటో కొని నడుపుకుంటా..

నా కూతురుకి మంచి భవిష్యత్తు ఇవ్వాలని..

అర్చనవతి, ఎల్బాక



నాకు ఆడపిల్ల పుట్టిందని అత్తింటివారు వేధించారు. ప్రస్తుతం తల్లి వద్దే ఉంటూ ఒక్క కూతురును పెంచుకుంటున్నాను. నా కూతురికి మంచి భవిష్యత్తు ఇవ్వలన్నదే నా లక్ష్యం. అందుకు ఆటో డ్రైవింగ్ నేర్చుకుంటున్నా. శిక్షణ పూర్తయ్యాక ఆటో కొనుక్కుని నా కాళ్లపై నేను నిలబడతా..

సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తికి జైలు శిక్ష

కోల్‌సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండలానికి చెందిన మాజీ జెడ్‌పీటీసీ కందుల సంధ్యారాణిని ఉద్దేశించి సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన లింగాపూర్ గ్రామానికి చెందిన నిమ్మరాజుల రవిపై నేరం రుజువు కావడంతో శుక్రవారం నాలుగు నెలల జైలుశిక్ష విధిస్తూ గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి నల్లాల వెంకట సచిన్‌రెడ్డి తీర్పునిచ్చారు. జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2020 మార్చి 30న అప్పటి పాలకుర్తి జెడ్‌పీటీసీ, లింగాపూర్ గ్రామానికి చెందిన కందుల సంధ్యారాణిని ఉద్దేశించి అదే గ్రామానికి చెందిన నిమ్మరాజుల రవి అసభ్యకరంగా ఫేస్‌బుక్‌లో పోస్టింగ్ చేశారు. దీనిపై ఆమె అంతర్గాం పోలీసు లకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు డ్యూటీ ఆఫీసర్ నాగరాజు కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టగా, కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నహీద పర్విన్ ప్రాసిక్యూషన్ తరఫున వాదన వినిపించారు. నేరం రుజువు కావడంతో రవికి కోర్టుకు జైలు శిక్ష విధించింది.

బావిలో మునిగి యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాసులపల్లిలో శుక్రవారం బావిలో మునిగి పెద్ది రమేష్(30) అనే యువకుడు మృతి చెందాడు. రమేష్‌కు మూర్ఛ వ్యాధి ఉండడంతో ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించినట్లు మృతుడి తండ్రి బీరయ్య తెలిపారు. శుక్రవారం రమేష్ కుటుంబం వేరుపడగా ఇంటిలోని సామగ్రి వేరే ఇంటిలో సర్దుకున్నట్లు తెలిపారు. అనంతరం స్నానం చేస్తానని భార్యకు చెప్పి సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఈత కొడుతున్న సమయంలో ఆక స్మాత్తుగా మూర్ఛ వ్యాధి రావడంతో నీటమునిగి మృతిచెందాడని తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

దొనూర్ పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య వివాదం

- అడ్డుకునే యత్నంలో ఎంఈవోపై దాడి
- ఉపాధ్యాయుడి సస్పెన్షన్


గాయపడిన ఎంఈవో సీతాలక్ష్మి

ధర్మపురి, మే 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం దొనూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం నిర్వహించిన పేరెంట్ టీచర్ మీటింగ్‌లో కాశెట్టి రమేష్ అనే ఉపాధ్యాయుడిపై గడిపెల్లి మహేష్ అనే ఉపాధ్యాయుడు అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడిచేశాడు. గొడవను ఆపేందుకు యత్నించిన ఎంఈవో సీతాలక్ష్మి పైనా మహేష్ దాడి చేయడంతో ఆమెచేతికి గాయం అయింది. శుక్రవారం ఉదయం 9గంటలకు పీటీఏ సమావేశం నిర్వహించగా ఎంపీపీఎస్, జడ్పీహెచ్‌ఎస్ టీచర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఉపాధ్యాయులు స్కూల్ ఆవరణలో మాట్లాడు తుండగా జడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న గడిపెల్లి మహేష్, అక్కడే ఉన్న దొనూర్ ఎంపీపీఎస్‌లో పనిచేస్తున్న కాశెట్టి రమేష్‌పై దాడి చేశాడు. గతంలోనూ మహేష్ ప్రవర్తన బాగా లేదని సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాడిచేసిన గడిపెల్లి మహేష్ పై చర్యలు తీసుకోవాలని ఎంఈవో సీతాలక్ష్మి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఉదయ్ కుమార్ మహేష్‌పై కేసు నమోదు చేశారు. కాగా దాడిచేసిన గడిపల్లి మహేష్‌ను సస్పెండ్‌చేస్తూ డీఈవో రాము ఉత్తర్వులు జారీ చేశారు.


యువకుడికి వలపు వల

- మహిళ పేరిట వాట్సాప్ చాటింగ్
- చిత్రహింసలకు గురిచేసి రూ. 22వేలు దోపిడీ
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు


నిందితులని అరెస్టు చూపుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): కామవాంఛ తీరుస్తామంటూ మహిళల పేరిట వాట్సాప్‌లో మెసెజ్‌లు పంపి యువకుడిని చిత్రహింసలకు గురిచేసి దోపిడీకి పాల్పడిన ముఠాలోని ఇద్దరు యువకులను శుక్రవారం కొత్తపల్లి పోలీసులు అరెస్టుచేయగా, మరొక నిందితుడు పరారీలో ఉన్నాడు. కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి వివరాలప్రకారం.. కొత్తపల్లి మండలంలోని చింతకుంట శాంతినగర్ ప్రాంతానికి చెందిన సరళ సందీప్(19) మరోఇద్దరు స్నేహితులు మల్కాపూర్, లక్ష్మీపూర్‌ప్రాంతానికి చెందిన పొన్నాల ప్రణయ్‌కుమార్(18), ఎండీ రెహాన్‌లు జల్సాలకు అలవాటు పడ్డారు. ప్రధాన నిందితుడు సందీప్ ఈనెల 6న తన ఫోన్‌నంబర్ ద్వారా మంచిర్యాల ప్రాంతానికి చెందిన ఓ యువకుడి(25)కు వాట్సాప్‌లో హాయ్ అయాం పూజ అంటూ మెసెజ్ చేశాడు. ఆమెసెజ్‌కు స్పందించిన యువకుడు చాటింగ్ ప్రారంభించాడు. కామవాంఛ తీరుస్తానంటూ ఆశ చూపడంతో అది నమ్మిన యువకుడు ఈనెల11న కరీంనగర్‌కు చేరుకున్నాడు. పథకం ప్రకారం దోపిడీ చేసేందుకు సిద్ధమైన ముగ్గురుయువకులు కొత్తపల్లి మండలకేంద్రానికి రమ్మని చెప్పారు. ఇందులో ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై సదరు యువకుడి వద్దకు చేరుకుని పూజకు సంబంధించిన వారమంటూ మాట్లాడారు. ముందే అనుకున్న ప్రకారం బైక్‌పై వెలిచాల గ్రామశివారు ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడికి చేరుకున్న వెంటనే మంచిర్యాల ప్రాంతానికి చెందిన యువకుడిని చిత్రహింసలకు గురిచేశారు. ఈ సందర్భంలో 50వేల రూపాయలు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోతే చంపుతామని బెదిరించారు. దీంతో భయభ్రాంతులకు గురైన సదరు యువకుడు తనవద్ద ఉన్న 10వేల రూపాయలు నగదు అందజేశాడు. బంధువులు, స్నేహితులకు ఫోన్‌చేసి మరో 12వేల రూపాయలు ఫోన్‌పే ద్వారా తెప్పించుకుని, ఆ మొత్తాన్ని ట్రాన్స్‌ఫర్ చేసి తీసుకున్నారు. తర్వాత సదరు యువకుడిని అక్కడనేవదిలేసి వెళ్లిపోయారు. ప్రధాన నిందితుడు అయిన సందీప్ గతంలో ఇదే తరహా దోపిడీలకు పాల్పడి వరంగల్‌లోని జువైనల్ హోంకు వెళ్లి శిక్ష అనుభవించాడు. ఈ ముగ్గురు ముఠా సభ్యుల దోపిడీకి గురైన బాధిత యువకుడు కొత్తపల్లి పోలీసుఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో భాగంగా కొత్తపల్లి ఎస్‌ఐ ఎస్ సాంబమూర్తి ఆధ్వర్యంలోని బృందం శుక్రవారం రేకుర్తి బస్టాండ్ ప్రాంతంలో నేరానికి పాల్పడిన సందీప్, ప్రణయ్‌కుమార్ అనే ఇద్దరు యువకులను గుర్తించి అరెస్టు చేశారు. మరో యువకుడు ఎండీ రెహాన్ పరారీలో ఉన్నాడు. యువకులు వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి సమక్షంలో పోలీసులు నిందితులను అరెస్టు చూపించారు.


జగిత్యాల జైత్రయాత్ర నేత.. నారాయణ మృతి


నారాయణ (ఫైల్)

కోరుట్ల రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జైత్రయాత్ర నేత పండుగ నారాయణ(75) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. కోరుట్ల మండలం సర్వరాజుపూర్ గ్రామానికి చెందిన పండుగ నారాయణ విప్లవ ఉద్యమాలకు ఆకర్షితుడై ఈ ప్రాంతంలో ఉద్యమాలకు స్వీకారంచుట్టాడు. కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మేడిపల్లి, కథలాపూర్ మండలాలతోపాటు జగిత్యాల డివిజన్ పరిధిలో ప్రజలను చైతన్యవంతం చేశాడు. విద్యార్థులు, యువకుల విలేజ్‌క్యాంపెయిన్ చేసి జగిత్యాల పల్లెలు భూస్వాములకు వ్యతిరేకంగా కదిలి 1978జూలై17వ తేదీన ఏర్పాటుచేసిన రైతుకూలీసంఘ మహాసభ 'జగిత్యాల చైత్యయత్రగా' ప్రసిద్ధి పొందడానికి నారాయణ కృషిచేశారు. ఎమర్జెన్సీ కాలంలో నారాయణ జైలుకు వెళ్లారు. ప్రస్తుతం ఆయన కుటుంబసభ్యులతోకలిసి మండలంలోని సర్వరాజుపూర్‌లో నివాసం ఉంటున్నాడు. కొన్ని రోజులుగా అనా రోగ్యంతో బాధపడుతున్న నారాయణ శుక్రవారం ఉదయం కన్నుమూశాడు. ఆయన అంత్యక్రియలు సర్వరాజుపూర్‌లో నిర్వహించగా రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు హాజరై సంతాపం ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- ఒకరికి గాయాలు


కొండ శ్రీనివాస్(ఫైల్)

గంగాధర, మే 16 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం ఇస్లాంపూర్‌వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు మృతిచెందినట్లు ఎస్సై స్వాతి తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. గంగాధర మండలం గర్శకుర్తికి చెందిన ఆంజనేయస్వామి మాలదారుడు కొండ శ్రీనివాస్(34) కొండగట్టుకు పాదయాత్రగా వెళుతున్నాడు. కొడిమ్యాల మండలం గౌరాపూర్‌కు చెందినకాసాని గణేష్(21), కాసాని రాజు గంగాధరనుంచి పూడూర్ వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. ఇస్లాంపూర్‌వద్దకు రాగానే బైక్‌పై వెళుతున్న వీరు.. రోడ్డు వెంట నడుచుకుంటూ వెళుతున్న శ్రీనివాస్‌నుఢీకొట్టారు. ఈ ప్రమాదంలో గాయపడిన కొండ శ్రీనివాస్, కాసాని గణేష్, కాసాని రాజును కరీంనగర్ తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ కాసాని గణేష్, కొండ శ్రీనివాస్ మృతిచెందారు. కాసాని రాజు చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేవీకేలో దుక్కి దున్నకుండా పంటల సాగు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న జయప్రకాష్

జమ్మికుంట రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞానకేంద్రం (కేవీకే)లో దుక్కి దున్నకుండా పంటల సాగు-సుగుణ పునరుత్పాదక పద్ధతి ప్రాజెక్ట్‌ను జాతీయ వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధిబ్యాంకు డీడీఎం జయప్రకాష్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లోని మూడుమండలాల్లో గల 16గ్రామాల్లో 25మంది రైతులతో దుక్కి దున్నకుండా పంటల సాగుపైన ప్రయోగాత్మకంగా పరిశీలన చేస్తున్నామన్నారు. వ్యవసాయంలో ఇటువంటి నూతన సాంకేతిక పద్ధతులకు నాబార్డ్ ముందుండి ఆర్థిక సహాయం చేస్తూ ప్రోత్సహిస్తోందని తెలిపారు. జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమశాఖ అధికారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సుగుణ పునరుత్పాదక పద్ధతి నేలరక్షణకి పునాది లాంటిది అన్నారు. పునాది బాగుంటేనే నేల నిర్మాణం, నేల ఆరోగ్యం బాగుంటుందన్నారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ నూతన విధానాలను కలిసికట్టుగా చేయడం వల్ల వాటిలో ఉన్న లోటుపాట్లను సులభంగా తెలుసుకోవచ్చన్నారు. సుగుణ పుణరుత్పాదక పద్ధతి రూపకర్త చంద్రశేఖర్ బాట్సాలె గూగుల్ మీట్ ద్వారా వారియొక్క అనుభవాలను తెలియజేశారు. కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త కె వెంకటేశ్వర్‌రావు, వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

తెల్లారితే పెళ్లి.. ప్రియుడితో వెళ్లిపోయిన పెళ్లికూతురు

- చిన్న కూతురును ఇచ్చి వివాహం జరిపించేందుకు సిద్ధమైన తల్లిదండ్రులు
- మైనర్ కావడంతో అడ్డుకున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): తెల్లారితే వివాహం కావాల్సిన పెళ్లి కూతురు ప్రియుడితో కలిసి పారిపోయింది. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, బంధువులు తమ పరువు పోతుందని భావించి చిన్న కూతురును ఇచ్చి వివాహం జరిపించేందుకు సిద్ధమయ్యారు. ఆమె మైనర్ అన్న సమాచారం తెలుసుకున్న అధికారులు వివాహాన్ని అడ్డుకున్నారు. ఈ సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని ఓ దంపతులకు ముగ్గురు కూతుళ్లు. పెద్ద కూతురుకు ఇదివరకే వివాహం కాగా, రెండో కూతురుకు 15రోజుల క్రితం నిశ్చితార్థమైంది. ఈనెల16న వివాహానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. తెల్లారితే పెళ్లిపీటలపై కూర్చోవలసిన పెళ్లికూతురు అదేగ్రామానికి చెందిన ప్రియుడితో కలిసి పారిపోయింది. బిడ్డ కనిపించడం లేదని ఆందోళనకు గురైన తల్లిదండ్రులు, బంధువులు ఆరాతీయగా విషయం తెలిసింది. పరువుపోతుందని వరుడికి తమ చిన్న కూతురు(మైనర్)ను ఇచ్చి పెళ్లి చేసేందుకు ఒప్పించారు. ఇరు కుటుంబాలు అంగీకరించడంతో వివాహానికి సిద్ధమయ్యారు. మైనర్‌కు పెళ్లి చేస్తున్నారనే సమాచారంతో ఐసీడీఎస్ అధికారులు, తహసీల్దార్, పోలీసులు రంగప్రవేశంచేశారు. బాలిక పుట్టినతేదీని పరిశీలించి వివాహానికి మరో రెండునెలలు గడువు ఉందని, పెళ్లిచేస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇరువర్గాలకు అవగాహన కల్పించి మైనారిటీ తీరేవరకు పెళ్లి చేయబోమని అంగీకారపత్రాన్ని రాయించుకున్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై కొరడా.. ఎక్స్‌కావేటర్ సీజ్

జగిత్యాలరూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలో మట్టి అక్రమ తవ్వకాలను అధికారులు అడ్డుకున్నారు. మండల పరిధిలోని నర్సింగాపూర్ గ్రామశివారులోని సర్వేనంబర్ 437లో కొందరు ఎక్స్‌కావేటర్‌తో అక్రమంగా మట్టి తవ్వుతుండగా స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ అక్రమ తవ్వకాలను గుర్తించి ఎక్స్‌కావేటర్ వాహనాన్ని సీజ్ చేశారు. సీజ్‌చేసిన ఎక్స్‌కావేటర్‌ని రెవెన్యూ అధికారులు జగిత్యాల బస్‌డిపోకు తరలించారు.

గుడుంబా పట్టివేత

కరీంనగర్‌క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటలోని శాంతినగర్‌లో కరీంనగర్‌రూరల్ ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించి ఆరులీటర్ల గుడుంబాను పట్టుకున్నారు. గుడుంబా కలిగిఉన్న ఇస్లావత్ సావిత్రపై కేసునమోదు చేశామని ఎక్సైజ్ ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. అనంతరం నిందితురాలిని తహసీల్దార్ ఎదుట హాజరుపరచి లక్షరూపాయల పూచీకత్తుపై బైండోవర్ చేశామని తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ కానిస్టేబుళ్లు స్వప్న, శ్రీలత పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఎలక్ట్రిక్ బైక్ దగ్ధం

రాయికల్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన నీలి పెద్ద రాము ఎలక్ట్రిక్ బైక్ షార్ట్‌సర్క్యూట్‌తో శుక్రవారం దగ్ధమైంది. 2024 అక్టోబర్‌లో రూ.55వేలతో ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేశాడు. బైక్ పట్టణంలోని తమ తోట వద్ద పెట్టి వ్యవసాయపనులు చేస్తుండగా వాహనం నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. గమనించిన యాజమాని బ్యాటరీ స్విచ్‌ఆఫ్‌చేసినా దగ్ధమైనట్లు తెలిపాడు.


దగ్ధమైన బైక్ వద్ద యజమాని

నిశ్చితార్థం రద్దు చేసుకున్న యువకుడిపై పోలీసులకు ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): నిశ్చితార్థం ఒకరితో చేసుకొని.. మరో యువతిని పెళ్లి చేసుకున్న ఓయువకుడిపై వధువు కుటుంబీకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధిత కుటుంబీకులు తెలిపిన ప్రకారం... హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన కుంట శ్రీనివాస్‌రెడ్డి చిన్న కుమారుడు సాఫ్ట్‌వేర్‌ఉద్యోగి మధుకర్‌రెడ్డికి కాట్రపల్లి గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో ఇటీవల నిశ్చితార్థం జరిగింది. కట్నకానుకలు కూడా మాట్లాడుకున్నారు. 16వతేదీన పెళ్లి జరగాల్సి ఉండగా వరుడు మధుకర్‌రెడ్డి ఈనెల15న మరోయువతిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో తమను మోసం చేశారని అమ్మాయి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీ సులు విచారణ చేపట్టారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి పూజలు



గణపతి అలంకరణ

ధర్మపురి, మే 16 (ఆంధ్రజ్యోతి): సంకష్టహర చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల గణపతి ఆలయంలో గణపతి ఉపనిషత్‌లతో శుక్రవారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు, హారతి, మంత్ర పుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేక మంది భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథం, సాయి కుమార్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.



గణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు






ఎడ్ల బండిపై ప్రయాణం, పుణ్యస్నానం ఆచరిస్తున్న యువతులు



స్వామివారి దర్శనం కోసం క్యూలో వేచిఉన్న భక్తులు





పుష్కర స్నానానికి వస్తున్న భక్తులు

ఆధ్యాత్మిక పుష్కరం.. అలౌకిక ఆనందం

- అంతర్‌వాహినిలో మునక.. పుణ్యస్నానాలకు ప్రతీక
- రెండో రోజు పోటెత్తిన భక్తజనం



కాళేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి): పుష్కరస్నానం.. సకల పాప హరణం... అని భావించే భక్తఘనకోటి సరస్వతీ పుష్కరాల్లో రెండో రోజున అంతర్వాహిని రూపంలో ఉన్న సరస్వతీ నదీ మాతల్లికి భక్తజనం నీరాజనం పలికింది. తొలిరోజు భక్తులసంఖ్య పలుచగా కనిపించినా.. రెండో రోజైన శుక్రవారం ఉదయం నుంచే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. శుక్రవారం సాయంత్రం వరకు కాళేశ్వరం దర్శించుకున్న భక్తుల సంఖ్య 50వేలు దాటిందని అధికారులు అంచనా వేశారు. అయితే పుష్కరాల నిర్వహణలో అధికారుల వైఫల్యంతో అడుగడుగునా ఇబ్బందులు ఎదురైనా.. భక్తులు వీటన్నింటిని తోసిరాజని పుష్కర స్నానాలు ఆచరించి క్షేత్రంలో కొలువై ఉన్న ఆ మహాదేవున్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

50 వేలకు పెరిగిన భక్తుల సంఖ్య

తొలిరోజు కొంత భక్తులు తక్కువ వచ్చినప్పటికీ.. రెండో రోజు సుమారు 50వేలకు పైగా భక్తులు వచ్చారు. కాళేశ్వరంలోని రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్, పోలీసులు ఉన్నప్పటికీ ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. అన్ని చౌరస్తాల వద్ద పోలీసులు ఉన్నప్పటికీ భక్తులు ఎలా వెళ్లాలో, ఎటు నుంచి వెళ్లాలో ఎవరూ చెప్పిన దాఖలాలు లేవు. కనీసం చౌరస్తాల వద్ద సూచన బోర్డులు కూడా పెట్టకపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 300 ఆర్టీసీ బస్సులు, కార్లు, ఆటోలు, వివిధ ప్రైవేటు వాహనాలు సుమారు 2800 వరకు వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. మొత్తంగా సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చినట్లు తెలిపారు. సరస్వతీ ఘాట్, ప్రధానఘాట్ వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తులు

సరస్వతీ పుష్కరాల సందర్భంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులు కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. సరస్వతీ నదిలో స్నానమాచరించిన అనంతరం నేరుగా ఆలయానికి వచ్చి శివ, యమ లింగాలను దర్శించుకున్నారు. అయితే వీఐపీలు వచ్చిన సందర్భంగా భక్తులను గంటసేపు నిలిపివేయడంతో తీవ్ర అసంతృప్తికి గురైన భక్తులు ఆలయ అధికారుల పనితీరుపై నిరసన వ్యక్తం చేశారు. ఈవో డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. అలాగే పోలీసులు సైతం అత్యుత్సాహం చూపి భక్తులను సరైన పద్ధతిలో పంపించడం లేదని విమర్శలు చేశారు.



పిండ ప్రదానం





అప్రమత్తంగా ఉండండి



- మారిన జీవనశైలి.. ఆహారపు అలవాట్లు
- ముందు జాగ్రత్తలతో అదుపులో
- నేడు హైపర్‌టెన్షన్ డే

సుభాష్‌నగర్, మే16 (ఆంధ్రజ్యోతి): చిన్న చిన్న విషయాలకే ఎక్కువగా ఆందోళనకు గురవుతుండడం.. ఎదుటి వారిపై అరవడం.. ఉద్వేగానికి లోనడం వంటి లక్షణాలను హైపర్‌టెన్షన్ అంటారు. సహజంగా ఇది అధిక రక్తపోటు కారణంగా వస్తుంది. అయితే ఆందోళన చెందని వారిలో కూడా దీని ప్రభావం ఉంటుంది. వారిలో కాళ్లు, చేతులు లాగడం, ఒత్తిడికి గురికావడం, బాగా తలనొప్పిగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఏది ఏమైనా హైపర్‌టెన్షన్‌తో కొన్నిసార్లు ప్రాణానికి ప్రమాదం తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రతి సంవత్సరం మే 17న హైపర్‌టెన్షన్‌డేను నిర్వహిస్తున్నారు. దీన్ని అదుపులో ఉంచుకోవడానికి అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఎలా వస్తుంది..

హైపర్ టెన్షన్ (హైబీపీ)కి అధిక రక్తపోటు ముఖ్యకారణం. దీని బారిన పెద్దలే కాదు పిల్లలు ఉండడం ఆందోళన కలిగించే అంశం. అసలు అధిక రక్తపోటు అంటే ఏమిటి?

ఎందువల్ల వస్తుంది?
ఎటువంటి నివారణోపాయాలు తీసుకోవాలి?
అనే అంశం మీద అవగాహన పెంచుకుంటే ఈ రుగ్మత నుంచి గట్టెక్కవచ్చు. లక్షణాలను బట్టి కారణాలు తెలుసుకోవచ్చు. నిర్ధారణ పరీక్షలు, చికిత్స, నివారణ చర్యలు తీసుకుంటే అధిక రక్తపోటు నుంచి బయ ట పడడం పెద్ద కష్టమైన పనికాదు. అయితే దీనిని నిర్లక్ష్యం చేస్తే రక్తనాళాలు దెబ్బతిని ప్రాణాంతకమవుతుంది.

అధిక రక్తపోటుకు కారణాలు..

శరీరంలో నీటి శాతం తగ్గినా లేదా బలహీనంగా ఉన్నవారు తొందరగా ఆందోళనకు గురవుతారు. ఈ సమస్యల వల్ల అల్ప లేదా అధిక రక్తపోటు వచ్చే అవకాశం ఉంటుంది. అల్ప రక్తపోటు (లోబీపీ) కారణంగా గుండె పని విధానంలో మార్పులు చోటు చేసుకుంటాయి. ఇదీ చాలా ప్రమాదకరం. కొన్ని సందర్భాల్లో గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి వెంటనే వైద్యులను సంప్రదించాలి. గర్భిణిలు కొన్నిసార్లు అల్ప లేదా అధిక రక్తపోటుకు గురవుతారు. హార్మోన్ల పని విధానం మారడమే దీనికి కారణం.

ఎవరికి వస్తుంది.

కుటుంబంలో అధిక రక్తపోటు ఉన్నవారు ఎవరైనా ఉన్నప్పుడు జన్యుపరంగా వస్తుంది. గుండె వ్యాధులు, మధుమేహం తదితర జబ్బులు అనువంశికత వల్ల వస్తున్నట్లయితే హైపర్‌టెన్షన్ వస్తుంది. 55 ఏళ్లు దాటిన వారికి అధిక బరువు ఉన్న వారికి, క్రియాశీలంగా లేని వారికి, మితిమీరి ధూమపానం, మద్యం సేవించే వారికి అధిక రక్తపోటు వచ్చే అవకాశాలున్నాయి. మనం తీసుకుంటున్న ఆహారంలో రెండు గ్రాములకు మించి ఉప్పు ఉన్నట్లయితే అధిక రక్తపోటుకు కారణం అదే అని చెప్పవచ్చు.

నిర్లక్ష్యం తగదు

చాలా మందికి తమకు అధిక రక్తపోటు గురించి అవగాహన లేకపోవడం వల్ల వారికి అధిక రక్తపోటు వచ్చిన విషయాన్ని గమనించ లేకపోతున్నారు. ఇది నిశ్శబ్దహంతకి. ఎటువంటి లక్షణాలు కనిపించకుండా అధిక రక్తపోటు ప్రాణాలను తీసుకుంటుంది. అధిక రక్తపోటును ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా హైపర్ టెన్షన్ తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది.

చికిత్స


అధిక రక్తపోటు మొదటి దశలో ఉంటే మందులు వాడడం ద్వారా తగ్గించుకోవచ్చు. ఒక రకం మందులు ఉపయోగించే వారిలో 50 శాతం మందికి అధిక రక్తపోటు అదుపులో ఉంటుంది. రెండు రకాల మందులు వాడేరోగుల్లో 80 శాతం మందికి ఈ వ్యాధి నియంత్రణలోకి వస్తుంది. గర్భిణుల్లో అధిక రక్తపోటు ఉంటే తల్లికి, బిడ్డకు ప్రమాదం కలిగే అవకాశాలు ఉంటాయి. ప్రసవ సమయంలో సమస్యలు ఏర్పడతాయి. బిడ్డపై ప్రభావం చూపలేని మందులను వారికి ఇవ్వాల్సి ఉంటుంది.

అదుపులో ఉంచుకోవాలి

డాక్టర్ రఘురామన్, సీనియర్ ఫిజీషియన్



ప్రజల జీవనశైలి, ఆహారపు అలవాట్లలో ఎంతో మార్పు వచ్చింది. ఆరోగ్యానికి హానిచేసే ఆహారాలకు అలవాటు పడ్డారు. అలాగే శరీరానికి ఏమాత్రం వ్యాయామం లేకుండా పోయింది. ప్రత్యేకంగా 40 సంవత్సరాలు దాటిన వారు క్రమంగా పరీక్షలు చేయించుకోవాలి. ప్రజలు తమ ఆరోగ్యాలకు వారే బాధ్యులు కాబట్టి జబ్బు వచ్చిన తర్వాత బాధపడే కంటే కారుండా జాగ్రత్త పడడం మేలు. హైపర్‌టెన్షన్‌ను అదుపులో ఉంచాలంటే శరీరం బరువు పెరగకుండా జాగ్రత్త పడాలి. కూరల్లో ఉప్పు తగ్గించాలి. ప్రతి రోజు వ్యాయామం చేయాలి. నిల్వ ఉన్న ఆహారాలకు దూరంగా ఉండాలి. ప్యాక్‌చేసిన ఆహారాన్ని ఎట్టి పరిస్థితుల్లో తీసుకోకూడదు. పచ్చళ్ల వాడకాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలి. ఉప్పు లేకుండా మజ్జిగ, పెరుగు తీసుకోవాలి. చిరుతిళ్లను పూర్తిగా తగ్గించాలి.



మానవీయ కోణంలో భూ సమస్యలు పరిష్కరించాలి

- క్షేత్ర స్థాయిలో కలెక్టర్లు పర్యటించాలి
- ఉమ్మడి జిల్లా కలెక్టర్ల సమీక్షా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

జగిత్యాల, మే 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్లు మానవీయ కోణంలో భూ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో శుక్రవారం ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులతో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.

జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల కలె క్టర్లు సత్యప్రసాద్, పమేలా సత్పతి, కోయ శ్రీహర్ష, సందీప్ కుమార్ ఝ, జగిత్యాల అదనపు కలెక్టర్ బీఎస్ లతతో పలు అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కలె క్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు ఎప్పటికప్పుడు తీసుకోవాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు సమన్వయంతో పనిచేస్తూ భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే రెవెన్యూ అధికారులపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసేలా కలెక్టర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజలు, రైతుల సంక్షేమమే ప్రధానంగా కలెక్టర్లు పని చేయాలని తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పనులు త్వరగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకవెళ్లి విజయవంతం చేయడంలో భాగంగా అధికార యంత్రాంగం అవలంబించాల్సిన పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

వేములవాడ కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఉదయం అంతంత మాత్రంగా భక్తులతో కనిపించిన ఆలయం మధ్యాహ్నం వరకు భక్తుల తాకిడితో సందడిగా మారింది. సాయంత్రం వరకు 50 వేల మంది వరకు రాజన్నను దర్శిం చుకున్నారని అంచనా. ధర్మగుం డంలో స్నానాలకు అనుమతిం చక పోవడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నల్లాల వద్ద భక్తుల పవిత్ర స్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్ర దర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం పరివార దేవతాలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్నారు. బద్ది పోచమ్మను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆలయ ఆవరణలో భక్తులు

సరస్వతి పుష్కరాల్లో 'మై నేషన్ ప్రిజన్స్ స్టాల్'



మై నేషన్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా

కరీంనగర్ క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా మై నేషన్ ప్రిజన్స్ స్టాల్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ స్టాల్‌లో ఖైదీలు తయారు చేసిన పర్యావరణ హిత ఉత్పత్తులను ప్రదర్శించారు. వేములవాడ రాజరాజేశ్వర ఆలయం నుంచి సేకరించిన పుష్పాలను వినియోగించి తయారు చేసిన అగరు బత్తులు వేస్ట్ టు వెల్త్' ప్రొడక్ట్ ఈ ప్రదర్శన లో ప్రత్యేకంగా ఆకర్షణగా నిలిచాయి. ఖైదీలు చేతితో తయారు చేసిన సబ్బులు, నేసిన వస్త్రాలు, వివిధ రకాల ఉత్పత్తులను స్టాల్‌లో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జైళ్ళశాఖ వరంగల్ రేంజి డీఐజీ ఎం సంపత్, వరంగల్ జైళ్ళశాఖ అధికారి టి కలాసాగర్ పాల్గొన్నారు.

● న్యూస్‌బాక్స్

సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

కరీంనగర్ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నీటి సంఘాల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 100 ఎకరాల ఆయకట్టు దాటిన చెరువులకు అప్పటి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం జరిగిందని, కాంగ్రెస్ వచ్చిన తర్వాత దాని కాలపరిమితిని 2008 వరకు పొడగించిందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 535 నీటిసంఘాలు ఉన్నాయని, అప్పటి ప్రభుత్వం కాలపరిమితి 2011లో అయిపోవడంతో దానిని 2013 వరకు పొడగించిందని పేర్కొన్నారు. తర్వాత ఎన్నికలు నిర్వహించకుండా స్పెషల్ ఆఫీసర్లను నియమించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సామాజిక వివాహాలను ప్రోత్సహించాలి

చిగురుమామిడి, మే 16 (ఆంధ్రజ్యోతి): సామాజిక వివాహాలను ప్రోత్సహించాలని జంబుద్వీప జనగజాగృతి సాంస్కృతిక విభాగం బాధ్యుడు సంపతి రమేష్ తెలిపారు. శుక్రవారం చిగురుమామిడి మండల కేంద్రంలో జంబూ జాగృతి సంఘం ఆధ్వర్యంలో బెజ్జంకి శ్రీను కన్నం చందు, మహరాజ్‌ల సామాజిక వివాహం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంపతి రమేష్ మాట్లాడుతూ దేశంలో ఉన్న నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో అణిచివేత నేటికి కొనసాగుతోందన్నారు. జంబూ ద్వీప జనజాగృతి ఆధ్వర్యంలో స్వేచ్ఛ, సమాన త్వం, సోదరభావం అనే విలువలతో సామాజిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జంబూ ద్వీప జనజాగృతి విభాగం ఇన్‌చార్జి సంపతి రమేష్, జిల్లా బాధ్యులు జంగం అంజన్‌బాబు, రామస్వామి, వధూవరులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపీని ఆహ్వానించకపోవడం బాధాకరం

సుభాష్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పుష్కరాల ప్రారంభోత్సవానికి స్థానిక ఎంపీ గడ్డం వంశీకృష్ణను ఆహ్వానించకపోడం బాధాకరమని మాల జేఏసీ జిల్లా చైర్మన్ బొగ్గుల మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ దళితుడైనందునే పుష్కరాలకు ఆహ్వానించలేదని ఆరోపించారు. ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు తగినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు ఉచిత వైద్యపరీక్షలు

సుభాష్‌నగర్, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచ హైపర్‌టెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉచిత వైద్యపరీక్షలు నిర్వహిస్తామని ప్రముఖ సీనియర్ వైద్య నిపుణుడు డాక్టర్ రఘురామన్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ ఆసుపత్రిలో నిర్వహించనున్న ఈ ఉచిత వైద్యశిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. యువజన కాంగ్రెస్ నాయకులు 'మత్తు వదలరా మిత్రమా' అనే ఇతివృత్తంతో ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను క్యాంప్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన పెంచడమే కాకుండా యువతను క్రీడలవైపు ఆకర్షించాలనే లక్ష్యంతో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్న నాయకులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం వాసు, జిల్లా ప్రధానకార్యదర్శి తాళ్లపల్లి శ్రీకాంత్, తొర్తి అరవింద్ పాల్గొన్నారు.

● మహిళా ప్రాంగణం సందర్శన

ఎల్ఎండీ కాలనీలో గల దుర్గాబాయి మహిళా శిశువికాసకేంద్రాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దంపతులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలకు ఇస్తున్న ఉచిత శిక్షణను వారు పరిశీలించారు. మహిళలతో మాట్లాడి వారి సాదక బాదకాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండేందుకు ఏదో ఒక రంగాన్ని ఎంచుకొని రాణించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దంపతులు ఆటోలో కొద్దిదూరం ప్రయాణించారు. కార్యక్రమంలో మహిళాప్రాంగణం జిల్లా మేనేజర్ సుధారాణి, అకౌంటెంట్ రాజారెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎల్ఎండీలో టైలరింగ్ నేర్చుకుంటున్న మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దంపతులు

పవర్ లిఫ్టింగ్ పతక విజేతలకు అభినందన

కరీంనగర్ స్పోర్ట్స్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించిన క్రీడాకారుణుల అభినందన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల క్రీడాకారిణులు ఈ నెల 5 నుంచి 12 వరకు డెహ్రాడూన్‌లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ యూనివర్సిటీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఎస్ ఐశ్వర్య 52 కిలోల విభాగంలో బంగారు పతకం, టి సిరిచందన, కె పూజిత రజత పతకాలు సాధించారు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ వీరికి పతకాలు బహూకరించి, ప్రశంసాపత్రాలను అందించి పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ క్రీడాకారులు కళాశాలతోపాటు రాష్ట్రానికి, భారతదేశానికి గర్వకారణమని తెలిపారు. వీరు మరింత ప్రతిభ చాటుతూ మున్ముందు అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని భారత క్రీడా కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి రాజయ్య, పి నితిన్, ఫిజికల్ డైరెక్టర్ ఎస్ నాగేశ్వర్‌రావు, అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కే సురేందర్ రెడ్డి, అధ్యాపకులు ఎ శంకరయ్య, కట్ట వేణు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారిణులను అభినందిస్తున్న ఎస్సారార్ ప్రిన్సిపాల్ కె రామకృష్ణ

జూలైలో బీసీల భారీ బహిరంగ సభ

గణేశ్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): జూలై నెలలో బీసీల భారీ బహిరంగ సభ నిర్వాహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీసీ ఉద్యమం 1990లో ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో ప్రారంభమైందన్నారు. 35 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జూలై నెలలో బీసీల భారీ బహిరంగ సభ ఉమ్మడి జిల్లాలోని బీసీ కుల సంఘాలు, నాయకులను కలుపుకొని సభ నిర్వహిస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో అన్ని మండలాల్లో బీసీ ఉద్యమాన్ని నిర్మించామన్నారు. ఎప్పటికప్పుడు బీసీ సమస్యలను పరిష్కరించే దిశగా బీసీ ఉద్యమం పనిచేస్తోందన్నారు. సభకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, బీసీ నాయకులను ఆహ్వానిస్తామని తెలిపారు. బీసీ నాయకులు అందరు మద్దతు ప్రకటించాలని కోరారు. ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని బీసీ సంఘాల పక్షాన కోరుతున్నామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు

కరీంనగర్ కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ఆలయాల్లో సంకటహర చతుర్థి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. భగత్‌నగర్ అంజనాద్రి లక్ష్మీగణపతి, జడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప, రాంపూర్ గిద్దెపెరుమాండ్లు, కమాన్‌రోడ్ రామేశ్వర, అశోక్‌నగర్ వాసవికన్యకాపరమేశ్వరి, ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయక స్వామి, పాతబజార్ గౌరీశంకర, చైతన్యపురి మహాశక్తి ఆలయాలతో పాటు పలు దేవాలయాల్లో జరిగిన అభిషేక, అలంకార, అర్చనల్లో, గణపతి హవనాల్లో భక్తులు పాల్గొన్నారు. ఆయా ఆలయాల నిర్వాహకులు, అధికారులు భక్తుల పూజల కోసం ఏర్పాట్లు చేశారు.

కరీంనగర్ రూరల్: సంకష్ట చతుర్థి సందర్భంగా శుక్రవారం కరీంనగర్ మండలం నగునూర్ గ్రామ శివారులోని దుర్గా భవానీ దేవాలయంలో లక్ష్మీ గణపతికి ఘన పూజలు జరిగాయి. స్వామి వారలకు విశేష అభిషేకం, ఫలపంచామృతాభిషేకం, విశేష హారతి పూజ కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు పవన కృష్ణ శర్మ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ బాధ్యులు, అధిక సంఖ్యంలో భక్తులు పాల్గొన్నారు.




స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న పురోహితుడు

న్యాయ కళాశాల ఏర్పాటులో మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి ఎనలేనిది

కరీంనగర్ లీగల్, మే 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు న్యాయ కళాశాల మంజూరు చేయడంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి ఎనలేనిదని స్టేట్ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్ భూక్య రజనీష్, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ కల్లెపల్లి లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ న్యాయ కళాశాలను మంజూరు చేయిస్తే బీజేపీ నాయకులు తమ ఖాతాలో వేసుకోవడం విడ్డూరమన్నారు. న్యాయ కళాశాల మంజూరు విషయమై బార్ కౌన్సిల్ ఆమోదం పొందడంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రమేయం ఏమీ లేదన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు బీజేపీ నాయకులు శాతవాహన యూనివర్సిటీ ఎదుట కార్యక్రమాలు చేయడం సిగ్గుచేటన్నారు. బండి సంజయ్ కుమార్‌కు దమ్ముంటే కేంద్రమంత్రి హోదాలో కరీంనగర్‌కు నేషనల్ లా యూనివర్సిటీని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎంపీగా, కేంద్ర మంత్రిగా బండి సంజయ్‌కుమార్ కరీంనగర్‌ను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. న్యాయ కళాశాల మంజూరు విషయంలో కృషి చేసిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా వైస్ చైర్మన్ వడ్లూరి కృష్ణ, జిల్లా కన్వీనర్ కొత్తకొండ శంకర్, లింగంపల్లి శ్రీకాంత్, కో-కన్వీనర్ ఐతు సృజన్, న్యాయవాదులు పవన్ కుమార్, గౌతమ్, మహేందర్, మురళి మనోహర్, కొత్త ప్రకాష్, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



గణేశ్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 9గంటల నుండి 11 గంటల వరకు నగరం, రూరల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టౌన్ టు, రూరల్ ఏడీఈలు ఎం లావణ్య, గాదం రఘు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఐబీ చౌరస్తా, మానేరు హోటల్, సర్కస్ గ్రౌండ్ ఏరియా, పద్మనాయక కల్యాణ మండపం, స్టేడియం, కట్టరాంపూర్, భగత్‌నగర్, గౌతమినగర్, ఎల్ఐసీ కార్యాలయ ప్రాంతం, కొత్త శ్రీనగర్‌కాలనీ ప్రాంతం, రోడ్డు నంబర్-1 ఏరియా, కశ్మీర్ గడ్డ, ఉమెన్స్ కళాశాల రోడ్డు, మైసమ్మ చెట్టు ఏరియాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు శక్తి టెంపుల్, బాలాజీ సూపర్ మార్కెట్ ఏరియా, సంతోష్ నగర్, భాగ్యనగర్, జ్యోతినగర్, గీతాభవన్ వెనుక వైపు, కార్పెంటర్ సొసైటీ ఏరియా, సంతోషి మాత, హనుమాన్ దేవాలయం, కొత్త లేబర్ అడ్డా, సాయిబాబా దేవాలయం ఏరియా, విద్యానగర్, విజయదుర్గా కాలనీ, హిందూపురి కాలనీ, ఆర్టీసీ వర్క్‌షాప్ ప్రాంతం, ఎస్సారార్ డిగ్రీ కళాశాల, చైతన్యపురి ప్రాంతంలో విద్యుత్ ఉండదని వినియోగదారుల సహకరించాలని కోరారు.

● కొత్తపల్లి (హెచ్)లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, బహదుర్‌ఖాన్‌పేటలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్, ఆముదాలపల్లి సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9:30నుంచి 11:30గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ రఘు పేర్కొన్నారు. మొలంగూర్ ఇండస్ట్రీయల్ ఏరియా, చింతలపల్లి, నల్లవెంకయ్యపల్లి, గుడాటిపల్లి, ఆముదాలపల్లి, రాజాపూర్, మెట్‌పల్లి గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

వీణవంక: మండలంలోని బేతిగల్ సబ్‌స్టేషన్ పరిధిలోని వల్భాపూర్, బేతిగల్ గ్రామాల్లో సాయంత్రం 4నుంచి 5గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా

- కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచుతామని కరీంనగర్ రూరల్ సీఐ ఎ నిరంజన్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ రూరల్ సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ ఎ నిరంజన్‌రెడ్డి శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు పరివర్తన చెందకుండా పాత పద్ధతులను అనుసరిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. గతంలో వివిధ రకాల నేరాలకు పాల్పడిన హిస్టరీ షీటర్లు సత్ప్రవర్తనతో మెదిలితే వారి పేర్లను పోలీసు రికార్డుల నుంచి తొలగిస్తామని తెలిపారు. రౌడీ షీటర్లపై నిరంతరం నిఘా కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మారెడ్డి, 25 మంది హిస్టరీ షీటర్లు పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘం మండల కమిటీ

భగత్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం కొత్తపల్లి మండల నూతన కమిటిని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు క్యాదాసి ప్రభాకర్ తెలిపారు. అధ్యక్షుడిగా ఓరుగంటి మధు, ఉపాధ్యక్షుడిగా నాపుండ్ల రాజేశం, కార్యదర్శులుగా మేకల తిర్మన్‌బాబు, చిర్ర బాలయ్య, ప్రచార కార్యదర్శిగా దావా శివను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్లానింగ్ కమిటీ చైర్మన్ గజ్జల ఆనంద్‌రావు, జిల్లా మహిళ అధ్యక్షురాలు కొండ్ర స్వరూప, జిల్లా కార్యనిర్వాహణ అధ్యక్షుడు జేరిపోతుల వాసు, జిల్లా ప్రధానకార్యదర్శులు మైసని మనోహర్, మానాల నారాయణ, చామనపల్లి చంద్రశేఖర్, జిల్లా ఉపా ధ్యక్షుడు కొలిపాక స్వామి, కోశాధికారి బీమరపు సతీష్, అధికారప్రతినిధి గడ్డం నాగరాజు తదితరులు పాల్గొన్నారు

బకాయిలను వెంటనే చెల్లించాలి

సుభాష్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించే అంతిమయాత్రకు సంబంధించిన బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయ కుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ పేదప్రజల కోసం ఒక్కరూపాయికే అంతిమయాత్ర పేరుతో మున్సిపల్‌లో పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. ఈ పథకాన్ని అమలు చేస్తున్నది ఎస్సీ కులస్తులని, అందుకుగాను ప్రభుత్వం వారికి బిల్లులు చెల్లిస్తుందన్నారు. రెండు సంవత్సరాలుగా బిల్లులు రాకపోవడంతో ఈ పథకం అమలు కోసం వారు అప్పులు తెచ్చి అంతిమ సంస్కారాలు నిర్వహించాల్సి వస్తుందని వాపోయారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మిక, కర్షక సమస్యల పరిష్కారమే లక్ష్యం

● సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

శంకరపట్నం, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ మహాసభలను నిర్వహిస్తుందని ఆపార్టీ జిల్లాకార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీపీఐ పార్టీ కార్యాలయం ముందు జెండా ఎగరవేసి 5వమండలస్థాయి మహాసభను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పేదప్రజల సమస్యలపరిష్కారం కోసం ఎర్రజెండాపార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండలకార్యదర్శి పిట్టల సమ్మయ్య, బోయిని అశోక్‌కన్నం సదానందం, ఎండీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

గంజాయిని తరిమికొడదాం: సీఐ

మానకొండూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గంజాయి వాడకాన్ని తరిమికొడదామని సీఐ సంజీవ్ అన్నారు. మానకొండూర్‌లోని బేకరీలు, పాన్‌షాపులు, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు గంజాయి వాడుతున్నారనే అనుమానం ఉన్న ప్రదేశాలను లియో డాగ్ స్క్వాడ్‌తో శుక్రవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయిని అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు.



బేకరీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

వృద్ధురాలిని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

హుజూరాబాద్‌రూరల్/హుజూరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లిలో రోడ్డు దాటుతున్న ఓ వృద్ధురాలిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికిచెందిన రాజమ్మ రోడ్డుదాటుతున్న క్రమంలో హుజూరాబాద్‌నుంచి హుస్నాబాద్‌వైపు వెళ్తున్న ఆర్టీసీబస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజమ్మకు తీవ్రగాయాలుకాగా హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనమేరకు వృద్ధురాలిని వరంగల్ ఎంజీఎంకు కుటుంబ సభ్యులు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు

హుజూరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం మున్సిపల్‌కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందులు పంపిణీచేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌కమిషనర్ సమ్మయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, ఆర్ఎంవో సుధాకర్‌రావు, డాక్టర్ మధు, డాక్టర్ జరీనా తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీలు

మానకొండూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగ్యూ నివారణ డే సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సల్మాన్ మాట్లాడుతూ గ్రామాల్లో మురికి కాల్వలు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాబోయే వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజ్‌నాయక్, హెల్త్ సూపర్‌వైజర్‌లు జుబేర్, సరోజ, మునీందర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్‌లో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, ఆర్ఎంవో డాక్టర్ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, డాక్టర్ మధు, పంజాల ప్రతాప్, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండల వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్ ఆధ్వర్యంలో మండల పరిదిలో ర్యాలీ నిర్వహించి, మానవహారం చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ డెంగ్యూపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.




మానకొండూర్, ఇల్లందకుంటలో ర్యాలీ తీస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

దిష్టిబొమ్మల దహనం

వీణవంక, మే 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీజేపీ మండలశాఖ అధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, జగ్గారెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ ఈటల రాజేందర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మలు దహనం చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్ది మల్లారెడ్డి, ఎనగంటి శ్రీనివాస్, అఖీల్, తిరుమల్, సమ్మయ్య, గాలేటి సురేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట పట్టణం సకల దేవతలకు నిలయం

● సచ్చిదానంద సరస్వతి మహాస్వామి

జమ్మికుంట, మే 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణం సకల దేవతలకు నిలయంగా మారిందని శ్రీశ్రీశ్రీ మఠం పీఠాధీశ్వరులు సచ్చిదానంద సరస్వతి మహాస్వామి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొండూరికాంప్లెక్స్‌లో గల సంతోషిమాత ఆలయంలో మహా కుంభాభిషేక మహోత్సవానికి హాజరైన ఆయన మాట్లాడుతూ అధ్యాత్మిక భావాలు, సనాతన ధర్మాన్ని పాటిస్తూ, భక్తుల విశ్వాసాన్ని కాపాడుతూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం మంచి విషయం అన్నారు. సకల మానవాళి దైవచింతనతో, భక్తిభావంతో ఉన్నట్లయితే మానసిక ప్రశాంతత కలుగుతుందని, ఇందుకు నిదర్శనమే ఈ కుంభాభిషేక మహోత్సవం అన్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో పలుప్రాంతాల్లో అన్నదానం నిర్వహించారు.



భక్తులకు ఆశీర్వచనం అందిస్తున్న స్వామీజీ

ఉగ్రవాదులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్ యాదవ్

రామడుగు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదులకు అనుకూలంగా పోస్టులు పెడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ స్టేట్‌కౌన్సిల్ మెంబర్ మేకల ప్రభాకర్‌యాదవ్ డిమాండ్‌చేశారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మోడీరవీందర్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీపై సోషల్ మీడియాలో అనుచితపోస్టులు చేసిన ముజాహిద్‌పై రామడుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉగ్రవాదులను పెంచి పోషిస్తోందన్నారు. భారతప్రధాని నరేంద్ర మోదిపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టి మూడు రోజులు గడుస్తున్నా పోలీసులు కేసు నమోదు చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. సాక్షాత్తు దేశ ప్రధాని జైలుకు వెళ్తున్నట్లు సోషల్‌మీడియాలో పెడితే ప్రభుత్వ వ్యవస్థలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, మాజీ మండల శాఖ అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉప్పు శ్రీనివాస్‌పటేల్, బండ తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రామడుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

సిర్సపల్లిలో బడిబాట

హుజూరాబాద్‌రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సపల్లిలో శుక్రవారం ఉపాధిహామీ పనుల్లో పాల్గొన్న కూలీలకు ప్రభుత్వపాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాల గురించి, పాఠ్యాంశాల బోధన తీరుగురించి వారికి ఉపాధ్యాయ బృందంఅవగాహన కల్పించింది. ఈ సందర్భంగా హెచ్ఎం వీడెపు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వపాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన, సకల సదుపాయాలు ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు కృషిచేయాలన్నారు.

పాడి గేదె అందజేత

ఇల్లందకుంట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకోమటిపల్లి గ్రామంలోని బాధితకుటుంబానికి రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో పాడిగేదెను అందించారు. రైతు స్వరాజ్యవేదిక రాష్ట్రకమిటీ సభ్యుడు ముక్క అయిలయ్య మాట్లాడుతూ గ్రామానికి చెందిన ముక్క సదయ్య భూమిని కౌలు తీసుకొని పత్తి సాగుచేయగా, దిగుబడి రాపోవడంతో రూ.4లక్షలు అప్పులు అయ్యాయన్నారు. అప్పులు తీర్చే మార్గంలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. సదయ్య కుటుంబసభ్యులను రైతు స్వరాజ్యవేదిక తరపున పరామర్శించి రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్‌సొసైటీకి విషయం తెలపగా, సంస్థ ద్వారా రూ.40వేల విలువచేసే పాడి గేదెను ఇవ్వగా, బాధితకుటుంబానికి అందజేశామన్నారు.

పరామర్శ..

ఇల్లందకుంట, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతర్లపల్లి గ్రామంలో మండల మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు కోడం రజిత కాలికి ఇటీవల ప్రమాదవశాత్తు గాయం కాగా కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రజిత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

సీఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు

తిమ్మాపూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్‌ను శుక్రవారం కాంగ్రెస్‌పార్టీజిల్లాకార్యదర్శి మామిడి అనిల్‌కుమార్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు బండారిరమేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. సీఐకి పూలమొక్క అందించి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పింగిలి కృష్ణారెడ్డి, సంతోష్, జంగా రామకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.